స్వాతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ



3 లో

మనం
కరీంనగర్
జగిత్యాల - రాజన్న సిరిసిల్ల - పెద్దపల్లి - మంచిర్యాల - కొమురంభీమ్
శనివారం | 12 | ఆగస్టు | 2023 | పేజీలు : 6

# ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించాలి

## కరీంనగర్ కలెక్టర్ డాక్టర్ గోపి



కరీంనగర్ బ్యూరో, ఆగస్టు 11 (మనం న్యూస్)ః రానున్న ఎన్నికలను సమర్ధ వంతంగా నిర్వహించి, విజయవంతం చేయడంలో అధికారులు బాధ్యతా యుతంగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ బి.గోపి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నోడల్ అధికారులు, సెక్టోరల్ అధికారులతో ఎన్నికల నిర్వహణపై సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్నికల కమిషన్ జారీ చేసిన ఆదేశాలను అధికారులు స్పష్టంగా తెలుసుకొని ఎన్నికలను విజయవంతం చేయాలని సూచించారు. గతంలో ఎన్నికల విధులను నిర్వహించినప్పటికి ఇప్పుడు నిర్వహించే ఎన్నికల విధులను కొత్తగానే భావించాలని, పోలింగ్ ముందు రోజు నుండి పోలింగ్ రోజు ఉదయం నిర్వహించే మాక్ పోల్ వరకు స్పష్టంగా విధులను గురించి తెలుసుకొని ఉండాలన్నారు. మీకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలను ముందుగానే సందర్శించి అందులో ఉన్న ఏర్పాట్లను గురించి తెలుసుకోవాలన్నారు. 18 సంవత్సరాలు నిండిన వారందరిని ఓటరుగా గుర్తించేలా చర్యలు తీసుకోవాలని, ట్రాన్స్ జండర్లు, వికలాంగుల వివరాలు జాబితా నుండి తప్పిపోకుండా సరిచూసుకొని, పోలింగ్ కేంద్రం వారిగా వికలాంగుల కొరకు వీల్ చైర్లు, ర్యాంపులు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. అగస్టు 28న డ్రాఫ్ట్ పబ్లిషింగ్ జరుగుతుందని, అరోజు నుండి అభ్యంతరాలను స్వీకరించి సెప్టెంబర్ 19 వరకు సర్దుబాట్లకు అవకాశం కల్పించి, అక్టోబర్ 4 న ఫైనల్ పబ్లికేషన్ జారిచేసి, ప్రజాప్రతినిధులకు సమాచారాన్ని అందించనున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లాలో నిర్వహించే ఇవియం, వివి పాట్, సియుల పై మొబైల్, డిమాన్షేషన్ కేంద్రాల ద్వారా కల్పించే అవగాహన కార్యక్రమాలను గురించి తెలుసుకోవడంతో పాటు ప్రజలకు కూడా తెలియజేయాలని సూచించారు. ఆగస్టు 19న జిల్లాలోని నాలుగు నియోజక వర్గాల హెడ్ క్వార్టర్ లలో ఐ ఓట్ ఫర్ షూర్ అనే నినాదంతో 5కిలోమీటర్ల రన్ ను నిర్వహించనున్నట్లు, ఈ కార్యక్రమంలో నియోజక వర్గాలకు సంబంధించిన అధికారులందరు పాల్గొనాలని ఆదేశించారు. సిపి సుబ్బారాయుడు మాట్లాడుతూ అధికారులకు కేటాయించి పోలింగ్ కేంద్రాల గురించి స్పష్టంగా తెలుసుకుని ఉండాలని, గతంలో ఇదేవిధంగా ఎన్నికల విధులు నిర్వహించామని కాకుండా, నూతంగా వచ్చిన ఆదేశాలను గురించి తెలుసుకొని దానికి అనుగుణంగా మెదులుకోవాలని సూచించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు ఉన్న చోట అప్రమత్తంగా వ్యవహరించాలని, ఎన్నికల నిర్వహణపై పై అధికారులకు సరైన సమాచారాన్ని ఆందించాలని, క్షేత్రస్థాయిలో సంబంధిత అధికారులతో సమావేశాలను నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లక్ష్మీ కిరణ్, ప్రపుల్ దేశాయ్, ట్రైని ఐపిఎస్ మహేష్ బాబాసాహెబ్, డిసిపిలు రాజు, లక్ష్మీ నారాయణ, కరీంనగర్, హుజురాబాద్ ఆర్డిఓలు మహేష్, రాజులతో పాటు ఇతర అధికారుల పాల్గొన్నారు.

## ప్లాస్టిక్‌ను నివారించి పర్యావరణాన్ని కాపాడుదాం

4 లో



# లక్ష్మీరాజం హత్య ఘటనలో నిందితుల అరెస్టు

## సంచలనం సృష్టించి లావాదేవీలు జరపాలనే హత్యకు పాల్పడ్డారు

## జగిత్యాల ఎస్పీ భాస్కర్



కోరుట్ల, ఆగస్టు 11 (మనం న్యూస్)ః కోరుట్ల పట్టణంలో ఈ నెల 8వ తేదీన జరిగిన కౌన్సిలర్ భర్త లక్ష్మీరాజం హత్య ఘటనలో తొమ్మిది మంది నిందితులను పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. ఈ ఘటనకు సంబంధించి తొమ్మిది మందిని అదుపులోకి తీసుకున్న పోలీసులు నలుగురిపై కేసు నమోదు చేశారు. ఈ హత్య కేసులో నిందితులుగా పేర్కొన్న వారిలో ఐదుగురు రౌడీ షీటర్లుండడం గమనార్హం. ఈ సందర్భంగా ఎస్పీ ఎగ్గడి భాస్కర్ విలేకరుల సమావేశంలో వారి వివరాలను వెల్లడించారు. ఆయన కథనం మేరకు పట్టణంలో ని ఒక ప్రముఖ వ్యక్తిని చంపడం ద్వారా సెటిల్మెంట్లు లావాదేవీలు చేసుకుంటూ సెటిల్ అవ్వాలన్న దుర్బుద్ధితో లక్ష్మీరాజం హత్యకు పాల్పడ్డారు. ఈ ఘటనలో విత్తనాల నాగరాజు ఆయన సోదరుడు త్రిమూర్తులు, పిల్లి సత్యానారాయణ, కాసుల వంశీ లపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అందరూ చూస్తుండగానే హత్య చేసి సంచలనం సృష్టించాలన్న ఆలోచనతో టీస్టాల్‌లో ఉన్న లక్ష్మీరాజంపై కత్తులతో దాడికి పాల్పడినట్లు పేర్కొన్నారు. నాగరాజు ఆయన సోదరుడు త్రిమూర్తిలతో కూడిన ఎనిమిది మంది బృందం సెటిల్మెంట్లు చేస్తూ రియల్ ఎస్టేట్ వ్యాపారులకు భయం కలిగించి అధిక డబ్బులు సంపాదిస్తూ సెటిల్ అవ్వాలన్న ఆలోచనతో లక్ష్మీరాజంను హత్య చేసినట్లు తెలిపారు. జులై 30వ తేదీ వంశీ ఇంటి పైన దావత్ చేసుకుని అదే రోజు లక్ష్మీరాజంను హత్య చేసేందుకు కుట్రపన్నారని వెల్లడించారు లక్ష్మీరాజంను హత్య చేసేందుకు నరసింహ అనే వ్యక్తి ఆయన

మిగతా 2లో..

# కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు చేసిందేమి లేదు

### డిసిసి అధ్యక్షులు ఆది శ్రీనివాస్

వేములవాడ టౌన్, ఆగస్ట్ 11 (మనం న్యూస్): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు చేసిందేమి లేదని జిల్లా కాం గ్రెస్ అధ్యక్షులు ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ పట్ట ణంలోని 15వ వార్డు బాలనగర్‌ను శుక్రవారం ఆది శ్రీనివాస్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ వార్డు ప్రజలతో మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిత్యవసర ధరలు పెంచి ప్రజలను అనేక ఇబ్బందులకు గురిచేస్తున్నాయన్నారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తే ప్రజలకు అన్ని రకాలుగా మేలు చేస్తామని తెలిపారు. కాం గ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే 500 రూపాయలకే సిలిండర్, నిత్యవసర వస్తువులు, నిరుద్యోగ భృతి, 4016 పెన్షన్ తో పాటు అనేక సంక్షేమ పథకాలతో ఆదుకుంటామని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ రానున్న ఎన్నికల్లో చేతు గుర్తుపైనే ఓటు వేయాలని ప్రజలను కోరారు.



## గద్దర్‌కు ఘన నివాళి



తిమ్మాపూర్, ఆగస్టు 11 (మనం న్యూస్)ః కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలంలోని మన్నెంపెల్లి గ్రామంలో శుక్రవారం మాల సంఘం భవనంలో గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మేడి అంజయ్య మాట్లాడుతూ ప్రజా నాయకుడు, విప్లవకారుడు గద్దర్ అస్తమయం బాధాకరమన్నారు. తెలంగాణ కొరకు ఆయన ఎన్నో ఉద్యమాలు నిర్వహించారని, ఆయన చేసిన సేవలను గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్‌లో గద్దర్ కాంస్య విగ్రహాన్ని పెట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాల సంఘం అధ్యక్షులు బూడిద రమేష్, ఉపాధ్యక్షులు బూడిద కొమరయ్య, ప్రధాన కార్యదర్శి అసోద అంజయ్య, క్యాషియర్ తుమ్మల రమేష్, గౌరవ అధ్యక్షులు సలహాదారులు, ఆశోద భూమ య్య, బూడిద అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక




ఇల్లందకుంట, ఆగస్టు 11 (మనం న్యూస్)ః మండల కేంద్రంలోని శ్రీరాములపల్లి గ్రామ అంబేద్కర్ సంఘం నూతన కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షులుగా మేకల నరేష్, ఉపాధ్యక్షులుగా మేకల సునీల్, మేకల రాజు, ప్రధాన కార్యదర్శిగా రణధీర్, సహాయ కార్యదర్శిగా వెంకటేష్, కోశాధికారిగా పర్లపెల్లి అన్వేష్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## మృతుని కుటుంబానికి మంజులారెడ్డి ఆర్థిక సహాయం



చిగురుమామిడి, ఆగస్టు 11 (మనం న్యూస్)ః చిగురుమామిడి మండలం లంబాడిపల్లిలోని నిరుపేద కుటుంబానికి చెందిన మంద పోషయ్య అనారోగ్యంతో మరణించగా ఆయన కుటుంబ సభ్యులను సామాజిక సేవకురాలు కర్ణకంటి మంజులరెడ్డి శుక్రవారం పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం పోషయ్య కుటుంబ సభ్యులకు ఐదు వేల రూపాయల ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో కాటం సంపత్ రెడ్డి, హనుమండ్ల కనక రెడ్డి, కర్ర అశోక్ రెడ్డి, ఐరెడ్డి రాజిరెడ్డి, చందబోయిన శ్రీనివాస్, మంజులక్క యువసేన సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## లక్ష్మీరాజం హత్య ఘటనలో నిందితుల అరెస్టు

మొదటి పేజీ తరువాయి..

కదలికలను ఎప్పటికప్పుడు నాగరాజుకు చేరవేసేవాడని తెలిపారు. లక్ష్మీరాజం ను హత్య చేసి ఈ హత్య ఆయన సోదరుడైన పిల్లి సత్యనారాయణ, త్రిమూర్తులు హత్య చేశామని పోలీసుల ముందు లొంగిపోవాలని నాగరాజు పథకం పన్నినట్లు విచారణలో వెల్లడైందని పేర్కొన్నారు. ఇందుకు గాను కొంత భూమితోపాటు లక్ష రూపాయలు నగదు ఇస్తానని వారిని ఒప్పించాడని తెలిపారు. అందుకు సహకరించిన వారికి కూడా తల ఒక లక్ష రూపాయలు నాగరాజు ఇస్తా నన్నాడని పేర్కొన్నారు. గతంలో ఆయన కరీంనగర్ లో విద్యుత్ శాఖలో లైన్‌మెన్‌గా విధులు నిర్వహించి ఒక వ్యక్తిని హత్య చేసిన ఘటనలో సస్పెండ్ అయినట్లు వివరించారు. ప్రస్తుతం తిరిగి ఉద్యోగంలో చేరి, బయట సెటిల్మెంట్ లతో పాటు భూదందా కొనసాగించాలని నాగరాజు చేసిన ఆలోచనల్లో భాగంగానే ఈ హత్య జరిగిందని పేర్కొన్నారు. డిఎస్పీ నేతృత్వంలో ఇద్దరు సర్కిల్ ఇన్స్పెక్టర్ లు ఐదుగురు సబ్ ఇన్స్పెక్టర్ల తో ఏడు బృందాలుగా ఏర్పడి నాలుగు గంటల్లోనే నిందితులను పట్టుకున్నామని పూర్తి విచారణ కొనసాగిస్తున్నామని పేర్కొన్నారు. మృతుని హత్యపై ఆయన బంధువుల్లో మరి కొంతమందిని విచారిస్తామని, ఈ కేసులో మరింత ప్రాథమిక సమాచారం సేకరించివలసిన అవసరం ఉందని భాస్కర్ స్పష్టం చేశారు. నిందితులు నిత్యం వాట్సాప్ కాల్ చేసేవారని దానికి సంబంధించిన టీం తో పూర్తి వివరాలు సేకరించి హత్య చేయడానికి గల సరైన కారణాలు వెల్లడించి వారిని చట్టప్రకారం కోర్టులో ప్రవేశపెడతామని పేర్కొన్నారు. నిందితుల్లో ఐదుగురు రౌడీషీటర్ లేనని ఎస్పీ భాస్కర్ తెలిపారు. శుక్రవారం సాయంత్రం 4 గంటల ప్రాంతంలో కారులో పారిపోతున్న విత్తనాల నాగరాజు, విశాల్, వంశీ, మధు, దీపక్ సిద్దు లను కోరుట్ల సర్కిల్ ఇన్స్పెక్టర్ ప్రవీణ్ కుమార్ తమ సిబ్బందితో కలిసి పట్టుకున్నారని ఎస్పీ తెలిపారు. ఈ హత్య కేసు అతి తక్కువ సమయంలో వివరాలు సేకరించిన మెట్‌పల్లి డిఎస్పీ, కోరుట్ల సర్కిల్ ఇన్స్పెక్టర్, మెట్పల్లి సర్కిల్ ఇన్స్పెక్టర్, కోరుట్ల, కథలాపూర్, మేడిపల్లి, మల్లాపూర్, పెగడపల్లి, సర్కిల్ ఇన్స్పెక్టర్ లను సిబ్బందిని ఎస్పీ భాస్కర్ అభినందించారు. నిందితులు వాడిన ఒక కార్ తో పాటు మూడు మోటార్ సైకిళ్లు, ఎనిమిది సెల్ ఫోన్లు, ఐదు కత్తులు స్వాధీనపరుచుకున్నామన్నారు. ఈ ఘటనపై ప్రజల్లో చాలా పుకార్లు కలిగిస్తున్నారని ఎలాంటి పుకార్లు నమ్మవద్దని అనుమానితులుగా ఎవరు కనిపించిన పోలీసులకు సమాచారం అందివాలని ఎస్పీ భాస్కర్ సూచించారు.

## గుండె జబ్బు బాధితునికి మై వేములవాడ ట్రస్ట్ చేయూత



వేములవాడ టౌన్, ఆగస్ట్ 11 (మనం న్యూస్): గుండె జబ్బుతో బాధపడుతున్న వ్యక్తికి మై వేములవాడ ట్రస్ట్ సభ్యులు చేయూత అందించారు. వేములవాడ మున్సిపల్ పరిధిలోని శాత్రాజుపల్లి గ్రామానికి చెందిన గుడిసె నరేష్ కు రక్తసరఫరా సరిగా లేక ఊపిరితిత్తుల్లో ఇన్ఫెక్షన్ ఏర్పడగా వెంటనే ఆపరేషన్ చేయాలని డాక్టర్లు సూచించారు. దీంతో నరేష్ ఆపరేషన్ కు సహాయం అందించాల్సిందిగా భార్య కవిత, ఇద్దరు చిన్నారులు మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులను సంప్రదించారు. వెంటనే స్పందించిన ట్రస్ట్ సభ్యులు దాతల నుండి విరాళాలు సేకరించి, పదివేల రూపాయలను బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా గుడిసె నరేష్ భార్య కవిత మాట్లాడుతూ విపత్కర పరిస్థితిలో ఆర్థిక సహాయం అందజేసిన చారిటబుల్ ట్రస్ట్ సభ్యులందరికీ, దాతలకు రుణపడి ఉంటామని తెలిపింది. ఇలాంటి సహాయ, సహకారాలు మరెందరికో అందించాలని కోరుకుంది. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు మధు మహేష్, గొంగళ్ళ రవికుమార్, డాక్టర్. బెజ్జంకి రవీందర్, పాత సంతోష్, పొలాస రాజేందర్, నక్క వేణు తదితరులు పాల్గొన్నారు.

## అఖండ భారత సంకల్ప దివస్‌ను విజయవంతం చేయాలి

### గోరక్ష ప్రముఖ్ రాధాకృష్ణారెడ్డి



హుజురాబాద్ రూరల్, ఆగస్టు 11 (మనం న్యూస్)ః అఖండ భారతావనిలో కోల్పోయిన భాగాన్ని తిరిగి సాధించాలనే సంకల్పంతో దేశ వ్యాప్తంగా ఈ నెల 14వ తేదీన నిర్వహించనున్న అఖండ భారత సంకల్ప దివస్‌ను విజయవంతం చేయాలని గోరక్ష ప్రముఖ్ ఉట్కూరి రాధాకృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా నిర్వహించనున్న కార్యక్రమంలో భాగంగా హుజురాబాద్ మండలంలోని విశ్వహిందూ పరిషత్, భజరంగ్ దళ్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 14వ తేదీన ప్రతి గ్రామంలో కాగడాల ప్రదర్శన నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భజరంగ్ దళ్ జిల్లా కార్యదర్శి అదిమూలం విద్యాసాగర్, జిల్లా ఉపాధ్యక్షులు కళ్లెపు సుధాకర్ రావు, జిల్లా కో-కన్వీనర్ కన్నం శంకర్, జిల్లా గోరక్ష ప్రముఖ్ రావుల అనిల్ కుమార్, మండల అధ్యక్షులు కంకణాల రమేష్‌రెడ్డి, పట్టణ కార్యదర్శి కనకం శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

# స్వాతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ



జగిత్యాల, ఆగస్ట్ 11(మనం న్యూస్): జిల్లా కేంద్రంలోని ఖిల్లా గడ్డలో మంగళవారం నిర్వహించనున్న స్వాతంత్ర దినోత్సవ వేడుకల భద్రత ఏర్పాట్లను ఎస్పీ భాస్కర్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఖిల్లా ప్రాంతంలో తిరిగి ఏర్పాట్లను పరిశీలించిన ఆయన, భద్రతా ఏర్పాట్ల విషయమై పోలీస్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. వేడుకల్లో భాగంగా నిర్వహించనున్న పోలీస్ పరేడ్ ను క్రమశిక్షణతో ఎలాంటి పొరపాట్లు జరగకుండా నిర్వహించాలని ఆర్ఐని ఆదేశించారు. ఖిల్లా కి వివిఐపి, విఐపిలు, వివిధ శాఖల అధికారులు, స్కూల్ విద్యార్థులు, ప్రజలు పెద్ద ఎత్తున హాజరుకానున్న నేపథ్యంలో ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టంగా భద్రతా ఏర్పాట్లు చేయాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ప్రభాకర్ రావు, డిఎస్పీ వెంకట స్వామి, టౌన్ ఇన్స్పెక్టర్ నటేష్, ఆర్ఐ వేణు పాల్గొన్నారు.

## హుజురాబాద్‌లో పోస్టల్ ఉద్యోగుల బైక్ ర్యాలీ



హుజురాబాద్ రూరల్, ఆగస్టు 11 (మనం న్యూస్): హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా హుజురాబాద్ పట్టణంలో పోస్టల్ ఉద్యోగుల ఆధ్వర్యంలోశుక్రవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పోస్ట్ ఆఫీస్ సబ్ డివిజనల్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ జె.అనంత రామ్ మాట్లాడుతూ ఈనెల 12తో జాతీయ జెండాల విక్రయం పూర్తవుతున్నందున ప్రజలు తపాలా శాఖ ఆధ్వర్యంలో విక్రయించే జాతీయ పతాకాలను కొనుగోలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హుజరాబాద్ ప్రధాన పోస్టల్ కార్యాలయం పోస్ట్ మాస్టర్ ఊకంటి మహేందర్ , పోస్టల్ ఉద్యోగులు పాల్గొన్నారు.

## పద్మశాలి రాజకీయ యుద్ధభేరి పోస్టర్ ఆవిష్కరణ



శంకరపట్నం ,ఆగస్టు11(మనం న్యూస్): ఈనెల 13న కోరుట్లలో జరిగే పద్మశాలి రాజకీయ యుద్ధభేరి పోస్టర్ ను శంకరపట్నం మండలం తాడికల్ గ్రామంలో పద్మశాలి కుల బంధువుల సమక్షంలో శ్రీ మార్కండేయ దేవస్థానం వద్ద శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పద్మశాలి కుల బంధువులు మాట్లాడుతూ ఆదివారం కోరుట్లలో జరగనున్న పద్మశాలి రాజకీయ యుద్ధభేరిని పార్టీలకు అతీతంగా పద్మశాలి కుటుంబ సభ్యులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు, ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం సభ్యులు వోడ్నాల కోటేశ్వర్, దుస్స శంకరయ్య, వోడ్నాల శ్రీనివాస్, ఉష కోయిల మహేష్ తాడికల్ పద్మశాలి కుల బాంధవులు పాల్గొన్నారు.



## జాన్సన్ గ్లోబల్ హైస్కూల్‌లో ఐఐటి ఫౌండేషన్ ప్రారంభం

కరీంనగర్, ఆగస్టు 11 (మనం న్యూస్): కరీంనగర్ జిల్లా కేంద్రంలోని జాన్సన్ గ్లోబల్ హైస్కూల్ ఆధ్వర్యంలో నూతనంగా ఐఐటి ఫౌండేషన్‌ను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో పాఠశాల నిర్వాహకులు మాట్లాడుతూ విద్యార్థిని, విద్యార్థులకు ప్రత్యేకం గా ఐఐటి, నీట్‌లతో మరింత నాణ్యమైన విద్యనందించేందుకు వీలుగా ఫౌండేషన్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జాన్సన్ గ్లోబల్ స్కూల్ డైరెక్టర్లు మహిపాల్, వరప్రసాద్, హరికృష్ణ, రామ్‌రెడ్డి, సంతోష్ రెడ్డి, ప్రధానోపాధ్యాయులు జయప్రకాష్ , ఉపాధ్యాయ బృందం, విద్యార్థిని, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## రామగుండం మున్సిపల్ కమిషనర్‌గా నాగేశ్వర్ బాధ్యతల స్వీకరణ



గోదావరిఖని,ఆగష్టు 11 (మనం న్యూస్): రామగుండం నగర పాలక సంస్థ నూతన కమిషనర్ గా సిహెచ్.నాగేశ్వర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా నగర మేయర్ బింగి అనిల్ కుమార్ తో పాటు కార్పొరేటర్లు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది కమిషనర్‌కు పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు.

## పోస్టల్ శాఖ బైక్ ర్యాలీ



గోదావరిఖని, ఆగస్టు 11 (మనం న్యూస్): హర్ ఘర్ తిరంగాలో భాగంగా గోదావరిఖనిలో పోస్టల్ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక పోస్ట్ ఆఫీస్ నుండి ప్రధాన చౌరస్తా, రామగుండం కార్పొరేషన్ మున్సిపల్ ఆఫీస్ మీదుగా గోదావరిఖని బ్రిడ్జి వరకు జాతీయ జెండాలతో బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం గోదావరిఖని సబ్ డివిజన్ పోస్టల్ ఇన్స్పెక్టర్ అరికిల్ల నరేష్ మాట్లాడుతూ ప్రతి పోస్టాఫీస్‌లో జాతీయ జెండాలు అందుబాటులో ఉన్నాయని, కేవలం 25 రూపాయలు చెల్లించి జెండా పొందవచ్చని తెలిపారు. ఆన్లైన్ లో కూడా బుక్ చేసుకునే వెసులుబాటు ఉందని, డబ్ల్యు.డబ్ల్యు.డబ్ల్యు.ఇపోస్టఆఫీస్. జివోవి. ఐన్ ద్వారా బుక్ చేసుకున్న మరుసటి రోజే స్థానిక పోస్టుమాన్ ద్వారా నేరుగా ఇంటికి డోర్ డెలివరీ చేస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో గోదావరిఖని పోస్ట్ మాస్టర్ వేణుగోపాల్, మెయిల్ ఓవర్సీర్స్ సతీష్ , పోచయ్య, పోస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

## విహెచ్‌పి ఆధ్వర్యంలో మట్టి గణపతుల పోస్టర్ ఆవిష్కరణ



కరీంనగర్, ఆగస్టు 11 (మనం న్యూస్): పర్యావరణం పట్ల అవగాహనతో పాటు పండుగలను ప్రకృతి అనుసారంగా జరుపుకునే విధానంలో భాగంగా విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో రూపొందించిన మట్టి గణపతుల పోస్టర్‌ను కలెక్టర్ బి.గోపి శుక్రవారం ఆవిష్కరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ పండుగలను, ఉత్సవాలను పర్యావరణానికి హాని కలుగకుండా జరుపుకోవాలని సూచించారు. మన సంప్రదాయ పండుగలను ప్రకృతికి, సకల జీవకోటికి హాని జరగకుండా నిర్వహించుకోవాలని, వినాయక చవితి, నవరాత్రుల సందర్భంగా నీటిలో సహజంగా కరిగే మట్టి గణపతులు, సహజ రంగులను వినియోగించి చెరువులను రక్షించుకోవాలని తెలిపారు. పర్యావరణం బాగుంటేనే మానవ మనుగడ ఉంటుందని, భవిష్యత్తు తరాలకు ఆదర్శంగా ఉండేలా మన జీవన విధానం ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ గోరక్ష విభాగ్ ప్రముఖ్ రాధాకృష్ణారెడ్డి, భజరంగ్ దళ్ జిల్లా కార్యదర్శి ఆదిమూలం విద్యాసాగర్, జిల్లా సహ ప్రముఖ్ కన్నం శంకర్ , నగర కార్యదర్శి మనోజ్ లాహోటి, వెంకటేశ్వర సేవా సమితి అధ్యక్షులు గాండ్ల సతీష్, తదితరులు పాల్గొన్నారు.

## అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో స్వాతంత్ర్య దినోత్సవ చిత్రలేఖన పోటీలు



కొత్తపల్లి, ఆగస్టు 11 (మనం న్యూస్): కరీంనగర్ జిల్లా కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా విద్యార్థిని, విద్యార్థులకు శుక్రవారం చిత్రలేఖన పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. దాదాపు 430 మందికి పైగా విద్యార్థిని, విద్యార్థులు చిత్రలేఖన పోటీల్లో పాల్గొని ఆకర్షణీయమైన బొమ్మలను చిత్రీకరించారు. వీటిల్లో ఉత్తమ చిత్రాలను ఎంపిక చేసి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా బహుమతులను అందించనున్నట్లు నరేందర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, సాంఘీక శాస్త్ర, చిత్రలేఖన ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## మృతుని కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే, సుడా చైర్మన్



మానకొండూర్, ఆగస్టు 11( మనం న్యూస్): మానకొండూర్ మండ లం చెంజర్ల గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ కార్యకర్త సిరిసిల్ల లక్ష్మయ్య కుమారుడు సాయికుమార్ ఇటీవల ఆత్మహత్య చేసుకుని మరణించగా శుక్రవారం వారి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, సుడా చైర్మన్ జి వి రామకష్ణారావు పరామర్శించారు. వీరితోపాటు జెడ్పిటిసి తాళ్లపల్లి శేఖర్ గౌడ్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు గడ్డి గణేష్, ఉండింటి శ్యామ్సన్, దుడ్డెల శంకర్, శామంతుల శ్రీనివాస్, కెమసారం కుమార్, ఎరుకొండ శ్రీనివాస్, వరుకొలు శంకర్, బర్రె సంపత్, జిల్లాల ఆంజయ్య మరియు ఇతర నాయకులు పాల్గొన్నారు.

# ప్లాస్టిక్‌ను నివారించి పర్యావరణాన్ని కాపాడుదాం

### ఇందుర్తి సర్పంచ్ స్వరూప

### ప్రజలకు బట్ట సంచులు, మొక్కల పంపిణీ

చిగురుమామిడి, ఆగస్టు 11 (మనం న్యూస్): ప్లాస్టిక్ వాడకాన్ని నివారించి ప్రతి ఒక్కరూ పర్యావరణాన్ని కాపాడేందుకు కంకణబద్ధులై ముందుకు సాగాలని చిగురుమామిడి మండలం ఇందుర్తి గ్రామ సర్పంచ్ అందె స్వరూప స్వామి పిలుపునిచ్చారు. శుక్రవారం ఆమె అధ్యక్షతన ఇందుర్తి గ్రామ సభ జరిగింది. ఈ సందర్భంగా ప్రజలనుద్దేశించి స్వరూప మాట్లాడుతూ ఒకసారి వాడి పడేసే ప్లాస్టిక్ భూమిలో కలిసిపోవడానికి వేల సంవత్సరాలు పడుతుందని, దాని వాడకం వల్ల నష్టమే తప్ప లాభం లేదన్నారు. అందుకే గ్రామంలో కూరగాయలకు ప్రతి వస్తువులకు ప్లాస్టిక్ కవర్లను వినియోగించకుండా బట్టసంచులే ప్రతి ఒక్కరు వాడాలని సూచించారు. రాబోయే తరాలకు మంచి వాతావరణాన్ని కల్పించేందుకు ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్‌ను విడనాడాలని పిలుపునిచ్చారు. ప్లాస్టిక్‌ను నివారించేందుకు వీలుగా గ్రామంలోని ప్రతి ఇంటికి బట్ట సంచుల పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. స్వచ్ఛ తెలంగాణ, స్వచ్ఛ కరీంనగర్, స్వచ్ఛ ఇందుర్తి లో భాగంగా గ్రామ పంచాయతీ పాలకవర్గం తీసుకున్న నిర్ణయాన్ని పలువురు గ్రామ ప్రజలు అభినందించారు. అనంతరం సర్పంచ్, వార్డు సభ్యులతో గ్రామ కార్యదర్శితో కలిసి గ్రామ ప్రజలకు బట్ట సంచుల తోపాటు ఇంటికి ఒక మొక్కను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో



వార్డు సభ్యులు చిలుపూరి విష్ణుమాచారి, ఆకుల శ్రీను, సిరాజ్, సుదగోని శ్రీనివాస్, స్కూల్ చైర్మన్ ఉస్మాన్, ప్రధానోపాధ్యాయులు లక్ష్మణ చారి, వైద్యాధికారి నిర్మల, బ్యాంకు మేనేజర్ ఆశిష్, గోలే రమేష్, లక్ష్మీ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ గాద రఘునాథ రెడ్డి, అంగన్వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు, సిఏలు, ఫీల్డ్ అసిస్టెంట్ లక్ష్మి, నాయకులు అందె చిన్నస్వామి, పరశురాములు తదితరులు పాల్గొన్నారు.



## క్షేత్రస్థాయి సిబ్బంది పూర్తి స్థాయి వివరాలతో సిద్ధంగా ఉండాలి

### జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) బి. రాహుల్

మంచిర్యాల; ఆగస్టు 11( మనం న్యూస్): స్వచ్ సర్వేక్షణ్ గ్రామీణ్-2023 కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని గ్రామాలలో చేపట్టిన కార్యక్రమాల పరిశీలించేందుకు కేంద్ర కమిటీ సభ్యులు జిల్లాకు రావడం జరిగిందని, గ్రామాలలోని క్షేత్ర స్థాయి సిబ్బంది వారి పరిధిలో చేపట్టిన కార్యక్రమాల పూర్తి వివరాలతో సిద్ధంగా ఉండాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) బి. రాహుల్ అన్నారు. శుక్రవారం కేంద్ర కమిటీ సభ్యులు జిల్లాలోని నస్పూర్లో గల సమీకృత జిల్లా శాఖల కార్యాలయాల భవన సముదాయంలో జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్, జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) బి. రాహుల్ లను మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ చాంబర్లో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ స్వచ్ సర్వేక్షణ్ గ్రామీణ్-2023 కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని 310 గ్రామపంచాయతీలలో చేపట్టిన కార్యక్రమాలను కేంద్ర కమిటీ సభ్యులు పర్యవేక్షించడం జరుగుతుందని, ఈ క్రమంలో శుక్రవారం భీమారం మండలంలోని పోలంపల్లి, ఖాజీపల్లి, బెల్లంపల్లి మండలంలోని బూదకలాన్, పెల్లి గ్రామపంచాయతీలను సందర్శించడం జరిగిందని తెలిపారు. జిల్లాలోని గ్రామాల క్షేత్రస్థాయి సిబ్బంది వారి కార్యాచరణను పూర్తి చేసుకుని అన్ని వివరాలతో సిద్దంగా ఉండాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి బి. శేషాద్రి, జిల్లా పంచాయతీ అధికారి డి. వెంకటేశ్వర్రావు, బెల్లంపల్లి డివిజనల్ పంచాయతీ అధికారి ఎ. ఫణిందర్, మండల పంచాయతీ అధికారులు, ఎస్.బి.ఎం., జిల్లా కో-ఆర్డినేటర్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐ ఉద్యోగం పొందిన యువతికి సత్కారం



వేములవాడ టౌన్, ఆగస్ట్ 11, (మనం న్యూస్): వేములవాడ పట్టణానికి చెందిన కొప్పుల లింగమూర్తి- పావని దంపతుల కుమార్తె కొప్పుల స్వాతి ఎస్ఐఉద్యోగం సాధించడం పట్ల బీఆర్ఎస్ నేత ఏనుగు మనోహర్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏనుగు మనోహర్ రెడ్డి శుక్రవారం కొప్పుల స్వాతిని శాలువాతో సన్మానించి, ప్రత్యేకంగా అభినందించారు. స్వాతి ఉద్యోగంలో రాణించి, ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించా రు. ఈ కార్యక్రమంలోసర్పంచ్ చిలుక అంజిబాబు, సింగిల్ విండో చైర్మన్ కిషన్ రెడ్డి, కౌన్సిలర్ నరాల శేఖర్, నీలం శేఖర్, కూరగాయల శేఖర్, ఉడుతల రాము, మల్లేశం, అశోక్, తిరుపతి తదితరులు ఉన్నారు.

## అంధుల పాఠశాలలో పారమిత డైరెక్టర్ జన్మదిన వేడుకలు




కరీంనగర్, ఆగస్టు 11 (మనం న్యూస్): స్థానిక పద్మనగర్ లోని పారమిత హెరిటేజ్ పాఠశాల డైరెక్టర్ రష్మిత ప్రసాద్ జన్మదిన వేడుకలను పాఠశాల విద్యార్థులు కొత్తపల్లి మండలం రేకుర్తి అంధుల పాఠశాలలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంధ విద్యార్థుల మధ్య కేక్ కట్ చేసి, పండ్లు, ఆహార పదార్థాలు, స్వీట్లు పంపిణీ చేశారు. చక్కటి సేవాభావాన్ని ప్రదర్శించిన విద్యార్థులను పారమిత విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఇ.ప్రసాద రావు ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రితేష్ మెహతా, ప్రోగ్రాం హెడ్ గోపికృష్ణ, సమన్వయ కర్తలు సరిత, హరిప్రియ, ఉపాధ్యాయులు దిడ్డి అభినవ్, రాజు, గౌతం , విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎస్సారెస్పీ కాలువలో పడి ఛత్తీస్‌ఘడ్ వాసి గల్లంతు



హుజురాబాద్ రూ రల్, ఆగస్టు 11 (మ నం న్యూస్): హుజురా బాద్ పట్టణ శివారులో గాంధీ నగర్ సమీపం లోని ఎస్సారెస్పీ ప్రధా న కాలువలో ప్రమా దవశాత్తు పడి ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రానికి చెందిన వ్యక్తి గల్లంతయిన ఘటన శుక్రవారం చోటుచేసు కుంది. ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రం భీమతార జిల్లా తనకహమియా గ్రామానికి చెందిన నేతం దిలీప్ (45) భార్య పిల్లలతో కలిసి గత కొన్ని నెలల క్రితం హుజురాబాద్ కు జీవనోపాధి కోసం వచ్చారు. గాంధీ నగర్‌లో ఉంటూ మేస్త్రి పని చేస్తూ కుటుం బాన్ని పోషించుకుంటున్నాడు. శుక్రవారం మధ్యాహ్నం బహిర్భూమికని వెళ్లిన దిలీప్ కాలువలోకి దిగగా ప్రమాదవశాత్తు కాలుజారి నీటి ప్రవాహంలో కొట్టుకుపోయాడు. ఆ సమయంలో అతని కుమారుడు రోషన్, భార్య ఉత్తర వెంట ఉండగా వారు చుట్టుపక్కల ఎవరూ లేకపోవడంతో కొద్ది దూరం వెళ్లి పలువురిని వెంట తీసుకువచ్చే లోపే నీటిలో మునిగి గల్లంతయ్యాడు. అతనికి భార్య ఇద్దరు కుమారులు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. బ్లూ కోల్ట్ పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది కాలువ వెంబడి రాత్రి వరకు గాలించిన అతని ఆచూకీ లభించలేదు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని కాలువ వెంబడి గాలిస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ తెలిపారు.



## స్వాతంత్ర సమరయోధులను స్మరించుకుందాం

### సింగరేణి పాఠశాల ప్రిన్సిపాల్ పురుషోత్తం

### ఘనంగా కుదిరాంబోస్ వర్ధంతి వేడుకలు



మందమర్రి ఆగస్టు 11( మనం న్యూస్): భారతదేశ స్వతంత్ర సమరయోధులను స్మరించుకుందామని వారి త్యాగాల స్ఫూర్తిని నేటి యువకులు గుర్తు పెట్టుకోవాలని మందమర్రి సింగరేణి పాఠశాల ప్రధానోపాధ్యాయులు పురుషోత్తం పేర్కొన్నారు శుక్రవారం మందమర్రి సింగరేణి పాఠశాలలో రిటైర్ ఆర్మీ రాజేష్ పివ్ హాల్ ఆధ్వర్యంలో కుదిరాం బోస్ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా కుదిరం బోస్ చిత్రపటానికి పూలమాలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా స్కూల్ ప్రిన్సిపాల్ పురుషోత్తం మాట్లాడుతూ కుదిరామ్ బోస్ వర్ధంతి వేడుకలు సింగరేణి పాఠశాలలో చేయడం చాలా గర్వంగా ఉందని స్వాతంత్ర సమరంలో మొదటి దశలో జరిగిన బ్రిటిష్ వారికి భారతీయులకు జరిగిన యుద్ధ సమయంలో కుదిరం బోస్ 19 సంవత్సరాలకే ఉరిశిక్షకు గురికావడం బాధాకరమన్నారు. ఆయన మరణించిన రోజున గుర్తుపెట్టుకుని ఆయన వేడుకలు జరపడం చాలా గర్వించదగ్గ విషయం అని తెలిపారు. రిటైర్డ్ సైనికుడైన రాజేష్ ఈ కార్యక్రమాన్ని చేయడం చాలా అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

## మొక్కలు నాటిన ఉప సర్పంచ్ ప్రణీత్ రెడ్డి



తిమ్మాపూర్, ఆగస్టు 11 (మనం న్యూస్)ః మేరా మిట్టి.. మేరా దేశ్ కార్యక్రమంలో భాగంగా కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం రామకృష్ణ కాలనీలోని ఎస్సారెస్పీ భూమిలో గ్రామ ఉప సర్పంచ్ గుజ్జుల ప్రణీత్ రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం మొక్కలు నాటారు. దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా 750 మొక్కలకు అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, స్థానికులతో కలిసి నాటారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి లచ్చయ్య, అదనపు అధికారి లలిత కుమారి, సాంకేతిక సహాయకులు చిరుత హరీష్, ఉమెన్స్ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు సుజాత, లావణ్య, శకుంతల, అరుణ తో పాటు క్షేత్ర సహాయకులు, గ్రామపంచా యతీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాదవశాత్తు కాలువలో పడి వ్యాపారి మృతి

హుజురాబాద్ రూరల్, ఆగస్టు 11 (మనం న్యూస్)ః హుజురాబాద్ శివారులోని గణేష్ నగర్ కెనాల్‌లో ప్రమాదవశాత్తు పడి హుజురాబాద్ మునిసిపల్ చైర్ పర్సన్ గంధె రాధిక మామ సాంబయ్య (74) మృతి చెందారు. వివరాల్లోకెళ్తే బిఆర్ఎస్ నాయకులు గందె శ్రీనివాస్ తండ్రి సాంబయ్య రైస్ మిల్లు లలో లెక్కలు రాస్తూ ఉండేవారు. శుక్రవారం యధావిధిగా ద్విచక్రవాహనంపై గణేష్ నగర్ వైపు వెళ్లి బహిర్భూమికి వెళ్లిన అనంతరం డివిఎం 16 కాలువలో దిగిన సందర్భంలో ప్రమాదవశాత్తు జారిపడడంతో నీటిలో కొట్టుకొని పోయారు. నీటి ప్రవాహానికి కొంత దూరం కొట్టుకుపోగా కాల్వ పరిసర ప్రాంతాల్లోని రైతులు చూసి తాడుతో మృతదేహాన్ని ఆపివేశారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి వచ్చి సాంబయ్య మృతదేహాన్ని ఒడ్డుకు చేర్చారు.





**ఎమ్మెల్సీ కౌశిక్ రెడ్డి పరామర్శః**

సాంబయ్య మృతి చెందిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ పాడి కౌశిక్ రెడ్డి మృతుని నివాసానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా సాంబయ్య మృతదేహానికి నివాళులర్పించి, మున్సిపల్ చైర్ పర్సన్ రాధిక, బిఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్‌లను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్, జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ టి.రాజేశ్వరరావు, కమిషనర్ సమ్మయ్య, సామాజిక కార్యకర్త వర్ధినేని రవీందర్రావు, మాజీ చైర్మన్ వడ్లూరు విజయకుమార్, మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ కొలిపాక నిర్మల, పట్టణ అధ్యక్షులు కొలిపాక శ్రీనివాస్, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.


మనం
జనం కోసం... అక్షర యజ్ఞం...
తెలుగు దినపత్రిక

కావలెను

'మనం' తెలుగు దినపత్రికకు ఈ దిగువ పేర్కొన్న సర్కిల్స్ పరిధిలో విలేకరులుగా పనిచేసేందుకు ఉత్సాహవంతులు కావలెను. చక్కటి రాత, తెలుగుభాషపై పట్టు ఉండి ఆసక్తి గల వారి నుంచి దరఖాస్తులు కోరబడుతున్నవి.

కావలసిన ప్రాంతాలు :

**మంచిర్యాల జిల్లా:** మంచిర్యాల, చెన్నూర్, బెల్లంపల్లి, నస్పూర్, హాజిపూర్, లక్షేటిపేట్, దండెపల్లి, జన్నారం, కోటపల్లి, వేమనపల్లి, జైపూర్, భీమారం, కన్నెపల్లి, నెన్నెల్, భీమిని, తాండూర్, కాసిపేట,

**ఆసిఫాబాద్ జిల్లా:** కాగజ్‌నగర్, సిర్పూర్(టి), కౌటాలా, చింతలమానెపెల్లి, పెంచికలపేట్, బెజ్జూరు, దహేగాం, రెబ్బెన. వాంకిడి, జైనూర్, కెరమెరి, సిర్పూర్(యు), తిర్యాని.

మండలాల వారిగా రిపోర్టర్లు కావలెను. అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును.

**నిర్మల్ జిల్లా:** నిర్మల్, ముధోల్, ఖానాపూర్ నియోజక వర్గాలు మరియు మండలాల వారిగా

**ఆదిలాబాద్ జిల్లా:** అదిలాబాద్, బోథ్ నియోజక వర్గాలు మరియు మండలాల వారిగా

మనం
జనం కోసం... అక్షర యజ్ఞం...
తెలుగు దినపత్రిక

పూర్తి వివరాలకై సంప్రదించవలసిన ఫోన్ నం:
సెల్ : 96666 99086, 83339 98076

# సైయేదా ఆమేనా మాకబౌల్‌కు పిహెచ్. డి ప్రధానం



నిజామాబాద్, ఆగస్టు 11,(మనం న్యూస్); తెలంగాణ విశ్వవిద్యాలయంలో ఉర్దూ విభాగానికి చెందిన సైయేదా ఆమేనా మాకబౌల్ కు బుధవారం పిహెచ్.డీ పట్టాను ప్రధానం చేశారు.ఉర్దూ విభాగ పూర్వపు పీఠాధిపతి ప్రొఫెసర్ అత్తర్ సుల్తానా ఆధ్వర్యంలో '' సైడ్ ఫాజిల్ హుస్సేన్ పెర్వేజ్ కి సహాఫాతి ఖిడమాట్ '' అనే అంశం పై సిద్ధాంత గ్రంథాన్ని సమర్పించారు.ఈ పీహెచ్‌డి వైవా కి ఎక్స్టర్నల్ ఎగ్జామినల్ గా ( ఉస్మానియా యూనివర్సిటీ )కి చెందిన ప్రొఫెసర్ శుకూర్ హాజరై పరిశోధకురాలును పలు ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టి సంతృప్తి చెందారు.ప్రొఫెసర్ అత్తర్ సుల్తానా సైయేదా ఆమేనా మాకబౌల్ కు పిహెచ్ డిడాక్టరేట్ పొందడం పట్ల ఆనంద వ్యక్తం చేశారు . సైయేదా ఆమేనా మాకబౌల్ కు కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్ ప్రొఫెసర్ అరుణ పీహెచ్డీ పట్టాను అధికారికంగా ప్రకటించారు. డీన్ ఫ్యాకల్టీ అఫ్ ఆరట్స్ ప్రొఫెసర్ కనకయ్య సైయేదా ఆమేనా మాకబౌల్ కు పి హెచ్ డి పొందిన సందర్భంగా అభినందనలు తెలిపారు.

ఈ వైవా కార్యక్రమం బి ఓ ఎస్ చైర్మన్ డాక్టర్ మహమ్మద్ అబ్దుల్ ఖవి , సమన్వయం చేయగా ,డా'మొహాద్ మూసా క్కురేషి,డా'గుల్ ఈ రానా తదితర పరిశోధక విద్యార్థులు శుభాకాంక్షలు తెలియజేశారు.సైయేదా ఆమేనా మాకబౌల్ కు పిహెచ్ డి పట్టా సాధించడం పట్ల కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు.



## ఏఎన్ఎంల మానవహారం

జగిత్యాల, ఆగస్టు 11 (మనం న్యూస్): సర్వీస్ ను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేస్తూ జిల్లాలోని ఎఎన్ఎంలు శుక్రవారం స్థానిక కలెక్టరేట్ వద్ద మానవహారంగా ఏర్పడి నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా ఎఐటియుసి అనుబంధ ఎఎన్ఎంల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గాండ్ల మధురిమ మాట్లాడుతూ తమ సమస్యల పరిష్కారం కోసం గత వారం రోజులుగా వివిధ రూపాల్లో నిరసన తెలుపుతున్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే పాలకులు స్పందించి ఇతర ప్రభుత్వ శాఖల్లో పనిచేసిన వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించిన మాదిరిగా తమను కూడా గుర్తించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 15వ తేదీలోగా తమను రెగ్యులరైజ్ చేసే విధంగా ప్రభుత్వం ప్రకటించాలని, లేని పక్షంలో 16వ తేదీ నుంచి సమ్మె చేపడతామని ఆమె హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు ఎలిజబెత్ రాణి, పద్మ, శిరీష, జమున, శారద, చిలుకమ్మ, నీరజ, స్వరూప, గణిత, రజిత, సరోజ, సౌజన్య, సునీత, జయప్రద, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం



ఇల్లంతకుంట, ఆగస్టు 11 ( మనం న్యూస్ ): రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంటలో లయన్స్ క్లబ్ సేవాసమితి ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. రేకుర్తి డాక్టర్ మాడేకర్ కంటి హాస్పిటల్ ట్రస్ట్ చైర్మన్ కొండ వేణు మూర్తి, ఉపాధ్యక్షులు చిదురి సురేశ్ సహకారంతో ఇల్లంతకుంట సేవాసమితి అధ్యక్షులు మంద చక్రధర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన వంద మందికి ఆస్పత్రి టెక్నిషియన్ ప్రభాకర్ కంటి పరీక్షలు నిర్వహించిన అనంతరం నిర్వాహకులు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శస్త్రచికిత్సలు అవసరమైన 30 మందిని రేకుర్తి కంటి దవాఖానాకు తరలించారు. ఈ కార్యక్రమంలో ఇల్లంతకుంట సేవాసమితి క్లబ్ అధ్యక్షుడు మంద చక్రధర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి అరుకూటి మల్లేశం, కోశాధికారి మామిడాల రవి, ఎర్రోజు సత్యం, ఇరుమల్ల నర్సయ్య, లయన్ డాక్టర్ జగన్ మోహన్ రావు, బాలరాజు, లయన్స్ క్లబ్ మెంబర్లు పాల్గొన్నారు.

# నిజామాబాద్

## 14 వరకు గృహలక్ష్మి దరఖాస్తుల స్వీకరణ



బోధన్, ఆగస్టు 11 (మనం న్యూస్): గృహ లక్ష్మీ పథకం దరఖాస్తుకు ప్రభుత్వం కేవలం మూడు రోజులే గడువు ఇచ్చిన సంగతి అందరికి తెలిసిందే. అతి తక్కువ సమయం ఉండడం వలన నియోజక వర్గంలో చాలా మంది అర్హులు దరఖాస్తు చేసుకోలేకపోయారు. విషయం తెలిసిన ఎమ్మెల్యే షకీల్ అర్హులందరికి లబ్ధి చేకూర్చేలా ప్రత్యేక చొరవ తీసుకొని దరఖాస్తు చేయని వారి కోసం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసారు. దరఖాస్తు చేయని వారు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఈ నెల 14 వరకు దరఖాస్తులు అందచేయాలని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే షకీల్ అమెర్ సూచించారు.

## తహశీల్దార్‌ను కలిసిన ప్రెస్ క్లబ్ సభ్యులు



మందమర్రి, ఆగస్టు 11 (మనం న్యూస్): మందమర్రి మండల తహశీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన చంద్ర శేఖర్‌ను క్యాతనపల్లి ప్రెస్ క్లబ్ సభ్యులు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్ప గుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షులు కలువల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి రామిళ్ళ శ్రీనివాస్, కోశాధికారి పరికిపండ్ల రాజు, సంయుక్త కార్యదర్శి పోలుదాసరి శ్రీనివాస్, ఇంచార్జి చొప్పదండి జనార్దన్, రణవెన రాకేష్ పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేను కలిసిన ఆలయ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు



వేములవాడ టౌన్, ఆగస్ట్ 11 (మనం న్యూస్): వేములవాడ రాజన్న ఆలయంలో విధులు నిర్వహిస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు శుక్రవారం ఎమ్మెల్యే రమేష్ బాబును కలిశారు. ఈ సందర్భంగా తమ ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ ఆయనకు వినతి పత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ గత టెండర్ ద్వారా పదిహేను ఏళ్లు అవుట్ సోర్సింగ్ పద్దతిన ఉద్యోగాల్లో నియమింపబడి, పదేళ్ళుగా విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఐదేళ్ల అవుట్ సోర్సింగ్ పద్దతిన జిల్లా కలెక్టర్ నియమించిన ఏజెన్సీ సురక్ష సర్విస్ హైదరాబాద్ ద్వారా వివిధ విభాగాల్లో విధులు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ప్రస్తుతం ఆలయంలో 235 మంది విధులు నిర్వహిస్తున్నామని, తమకు చెల్లించే నామమాత్రపు వేతనాలతో కుటుంబ పోషణ భారంగా మారిందని ఆవేదన వెలిబుచ్చారు. అన్నారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తే ప్రభుత్వంపై ఎలాంటి భారం ఉండదని, చెల్లించే వేతనాలు ఆలయానికి వచ్చే వార్షిక ఆదాయం నుండి చెల్లించడం జరుగుతుందని, ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు.